## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మిత్ర కృష్ణ



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్వాన్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే మిత్ర కృష్ణ అన్నారు. శనివారం ఆయన తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి తనతో అన్నారని మిత్ర కృష్ణ తెలిపారు.

## సందడిగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన దృశ్యం

అబిడ్స్: ధూల్‌పేట్‌లోని రిలయన్స్ హైటెక్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సందడిగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ జితేందర్ సింగ్ ఈ వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. తమ రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యా సంస్థల్లో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక, ఇతర రంగాల్లో కూడా విద్యార్థులు రాణించేలా వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ భావాలను వెలికితీసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు జితేందర్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



తనుజ బాయి

అబిడ్స్: మహిళ అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం..ధూల్‌పేట టక్క రివాడిలో నివసించే తనుజ బాయి (50) ఈనెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆందోళన చెందిన ఆమె భర్త దర్శన్ చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ కోసం పోలీసులు రైల్వేస్టేషన్లలో, బస్‌స్టేషన్లలో గాలించారు. ఆమె ఆచూకీ లభిస్తే మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు.



## ప్రజలకు అందుబాటులో ఉండాలి



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పని చేయని నాయకులను ప్రజలు నిలదీస్తారని అందువల్లే ప్రతిఒక్క మజ్లిస్ ఏరియా కమిటీ నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో గోల్కొండ, టోలిచౌకీ, లంగర్‌హౌస్, నానల్‌నగర్ డివిజన్లకు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులను పిలిచి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తమ తమ ప్రాంతంలోని సమస్యలను తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొందరు స్థానికులు మజ్లిస్ నాయకులు, ఏరియా కమిటీ ప్రతినిధులు తమకు కనబడడం లేదన్న ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. సమస్యలను తెలుసుకోని వాటిని తన దృష్టికి తీసుకురావడమే మజ్లిస్ ఏరియా కమిటీల ప్రథమ కర్తవ్యం అని ఆయన గుర్తు చేశారు. ఆయనను కలిసిన వారిలో మజ్లిస్ నాయకులు సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.

## సనాతన హైందవ ధర్మాన్ని రక్షించాలి



హనుమాన్ చాలీసా పఠనంలో
మహంతి యోగి ప్రశాంత్ దాస్‌జీ మహారాజ్, బాబన్న

జియాగూడ: సనాతన హైందవ ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని మహంతి శ్రీ యోగి ప్రశాంత్ దాస్‌జీ మహారాజ్ అన్నారు. శనివారం సాయంత్రం జియాగూడలోని 2బిహెచ్‌కేలోని సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కోశాధికారి సీహెచ్. కాశిబుగ్గ బాబన్న ఆధ్వర్యంలో ఏర్పాటైన సామూహిక హనుమాన్ చాలీసా పఠనం, యోగా, సనాతన ధర్మ విశ్లేషణ ప్రవచనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు హనుమాన్ చాలీసా బోధించారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, జియాగూడ అధ్యక్షుడు మోహన్‌చారి, పి.రాజు, జుగల్ కిశోర్, గోపాల్, సంతోష్, పాలెం వెంకటేష్, కె.నర్సింగ్‌రావు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు



రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో మెమొంటోలు అందజేస్తున్న అతిథులు

సుల్తాన్‌బజార్: గుడ్ ఫ్రైడ్, ఈస్టర్ పండుగల నేపథ్యంలో 15 ఏళ్ల నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా క్రిస్టియన్ సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ తెలుగు చర్చెస్ ఇండిపెండెంట్ చర్చెస్ సహకారంతో రన్ ఫర్ జీసస్ అనే ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ సెయింట్ మేరీ బసిలికా చర్చి వద్ద ప్రారంభమై అబిడ్స్ సెయింట్ జార్జ్ స్కూల్ వరకు జరిగింది. ముఖ్య అతిథులుగా రోమన్ క్యాథలిక్ చర్చి కార్డినల్ బిషప్ పూల ఆంథోని హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ప్రభు మానవాళి పాప పరిహారం, పాప విమోచన కోసం భూలోకానికి మానవునిగా జన్మించారని వివరించారు. ఏసుక్రీస్తు తన 33వ ఏటా ధర్మ శాస్త్ర గ్రంథంలో రాయబడిన ప్రకారం..కల్వరి శిలువపై ప్రాణత్యాగం చేసి గుడ్ ఫ్రైడే రోజున మరణించి తిరిగి మూడవ రోజు ఈస్టర్ ఆదివారం పునరుత్థానం చెంది సమాధి నుంచి సజీవుడిగా లేచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెథడిస్ట్ బిషప్, ఎంఏ డానియల్, థెరిస్సా పాల్, పాల్ దేవప్రియం, ఉషాపాల్, రేవ మోహన్‌బాబు, బిషప్ విల్సన్, దీపక్ జాన్, పాస్టర్లు, వేలాది మంది యువత పాల్గొన్నారు.

## నేడు పాతబస్తీలో ట్రాఫిక్ దారి మళ్లింపు

చార్మినార్: రంజాన్ మాసంలో ఇస్లామిక్ కేలండర్ 20వ రోజున జరుపుకొనే హజ్రత్ అలీ వర్ధంతికి సంబంధించి ఆదివారం చార్మినార్ స్మారక చిహ్నం లోపల నుంచి ప్రారంభమై కాలీ కబర్ సమీపంలోని మసీద్–ఇ–ఇమామియా వైపు షియా ముస్లింలు సామూహిక ఊరేగింపు సాగుతుంది. ఇందులో భాగంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల దారి మళ్లింపు ఉంటుందని నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ ప్రకటనలో తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అబిడ్స్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 1.25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం..బలరామ్‌గల్లీకి చెందిన విక్రమ్‌సింగ్ (40) ఈనెల 30న ఉదయం బలరామ్‌గల్లీ దుర్గాహజరి ఫంక్షన్‌హాల్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 1.25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకుని విక్రమ్‌సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్..

అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్న వ్యక్తిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం ..బలరామ్ గల్లీకి చెందిన బబన్‌సింగ్ తన నివాసంలో మద్యం విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి పలు రకాల బ్రాండ్‌లకు చెందిన 13 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



గౌలిపురా: అయోధ్య నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ (కేటీఎస్)లో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో పాఠశాల విద్యార్థులు పలు రకాల ఆహార వంటకాలు, ఫ్రూట్ జ్యూస్‌లు, పాప్‌కార్న్, పొటాటో లాలీపాప్స్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ఫుడ్ ఫెస్టివల్‌లోని వంటకాలను రుచి చూశారు. ప్రిన్సిపాల్ మంజుల నీలం, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన పరమేశ్వరీ సింగ్



అబిడ్స్: సీఎం రేవంత్‌రెడ్డిని మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ శనివారం కలిశారు. కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు ఆమెకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తానన్నారు.

# జీఎన్ఐటీఎస్‌లో స్టార్టప్‌లపై అవగాహన



గోల్కొండ: జర్మనీలో ఉన్న స్టార్టప్‌లకు ఆసియా మార్కెట్ గేట్‌వేని సులభతరం చేయడమే తమ ప్రయత్నమని ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి లెంక అన్నారు. శనివారం షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్స్‌ప్యాన్షన్ ల్యాబ్, బీటా హౌజ్ ఆసియా బెర్లిన్ స్టార్టప్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇండో జర్మన్ సహకారంలో భాగంగా జర్మనీలో ఉన్న స్టార్టప్‌లకు ఆసియా మార్కెట్‌లో సులభతరం చేయడం కోసమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. జీఎన్ఐటీఎస్, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ జీఎన్ఐటీఎస్ ఫౌండేషన్, యాస్టిలలేటర్ మిరాయి నెక్స్, బెర్లిన్ పర్యావరణ వ్యవస్థ నుంచి అనధికార పిచ్ తయారు చేసిన స్టార్టప్‌తో ఈ ప్రతినిధి బృందంలో మొత్తం పది మంది ఉన్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జీఎన్ఐటీఎస్, ఎండీఏఐసీ జీఎన్ఐటీఎస్ ఫౌండేషన్ బీటా హౌజ్, బెర్లిన్, ఆలిషా లేవిస్ క్రేవ్ స్టార్టప్ ల్యాబ్‌ల నుంచి కటుకా నాగ్యోవాల మధ్య సహకార అవగాహన ఒప్పందం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్ పర్సన్ శ్రీవిద్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ఆలయాల పరిరక్షణకు కృషి



పూజలు చేస్తున్న లక్ష్మణ్, శంకర్, మహేందర్

జియాగూడ: చారిత్రక ఆలయాల పరిరక్షణ, అభివృద్ధికి బజరంగ్‌సేనా తెలంగాణ విశేషంగా కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. శనివారం జియాగూడలోని ఇమాంపురాలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో పంచముఖి హనుమాన్ సేవాదళ్ అధ్యక్షుడు పి.శంకర్, ప్రధాన కార్యదర్శి గుండ్రపల్లి మహేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మందిరంలో ప్రత్యేక పూజలు, మహా హారతి, సామూహిక హనుమాన్ చాలీసా పఠనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాదళ్ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..నగరంలో చారిత్రక ఎన్నో ఆలయాలు దూపదీప నైవేద్యాలు లేక శిథిలావస్థకు చేరుకుని కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాహుల్, విజయ్‌కుమార్, జశ్వంత్, జీవీకే వెంకట్, పవన్ ఇందోరియా, పురుషోత్తమ్, పూజారి శంకర్, దీపక్, నరేష్ పాల్గొన్నారు.

# జోరుగా పండ్ల విక్రయాలు



సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద..



అమ్మకానికి పైనాపిల్, బొప్పాయి

గోల్కొండ: రంజాన్ మాసం కావడంతో మార్కెట్‌లో వివిధ రకాల పండ్లు పెద్ద ఎత్తున అమ్మకానికి వస్తున్నాయి. రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష విరమణ కోసం పండ్లను స్వీకరిస్తారు. పుచ్చకాయలతో పాటు పైనాపిల్, సపోటా, మామిడి పండ్లు, బొప్పాయి కూడా మార్కెట్‌లో జోరుగా అమ్ముడవుతున్నాయి. గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ప్రతినిత్యం వందల టన్నుల పుచ్చకాయలు అమ్ముడవుతున్నాయి. అదే విధంగా బొప్పాయి, ఆరెంజ్, సపోటా, అరటిపండ్లకు కూడా మంచి గిరాకీ ఏర్పడింది. పండ్ల ధర లు కూడా అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఉన్నాయి. ఎక్కువగా అమ్ముడయ్యే పుచ్చకాయలు కిలో రూ.16–25 చొప్పున అమ్ముతున్నారు. బొప్పాయి కిలో రూ.30, సపోటా కిలో రూ.40, ఆరెంజ్ రూ.100కు 12గా అమ్ముడవుతున్నాయి.

# సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానంటూ మోసం

జియాగూడ: తిరుమల సుప్రభాత సేవ టికెట్లు, వసతి కల్పిస్తాననిఓ వ్యక్తి వాట్సాప్ మెసేజ్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.26 వేల నగదును పంపి మోసపోయిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ బి.రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం..పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ మహంకాళీ స్ట్రీట్‌కు చెందిన ధినేష్‌కుమార్ (30), ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 4న ధినేష్ బాబు అనే గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్‌లో తిరుమల సుప్రభాత సేవా టికెట్లు అందుబాటులో ఉన్నాయంటూ మెసేజ్ పెట్టాడు. అది చూసిన బాధితుడు ధినేష్ కుమార్ 8వ తేదీన ఒకొక్కరికి రూ.2500 చొప్పునా ఐదుగురికి కలిపి రూ.12 వేలను ఫోన్ పే చేశాడు. ఇది గమనించిన ధినేష్ బాబు ఫోన్‌చేసి రశీదు, వివరాలు పంపిస్తానని వసతి కావాలంటే అదనంగా రూ.4 వేలు పంపాలన్నాడు. బాధితుడు వెంటనే రూ.4 వేలు ఫోన్ పే చేశాడు. మళ్లీ ధినేష్‌బాబు ఫోన్‌చేసి తన స్నేహితుడు టికెట్ల కోసం క్యూలో ఉన్నాడని తన ఫోన్ పే పనిచేయడం లేదని స్నేహితుడి ఫోన్‌కు రూ.10 వేలు పంపాలని కోరాడు. దీంతో బాధితుడు మళ్లీ రూ.10 వేలు ఫోన్ పే చేశాడు. అప్పటి నుంచి ఫోన్ చేస్తే ఎలాంటి రెస్పాన్స్ రాకపోగా పనిలో పడిన ధినేష్‌కుమార్ మరిచాడు. దీంతో శనివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తాను రూ.26 వేలు ఆన్‌లైన్‌లో ఫోన్ పే చేసి మోస పోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఎన్‌సీఆర్‌బీలో కూడా ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రద్దీ ప్రాంతాలే టార్గెట్..

- సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా సెల్‌ఫోన్ల చోరీలు
- పట్టించుకోని పోలీసులు

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రద్దీగా ప్రాంతాలే టార్గెట్ చేసుకొని ముఠాలుగా ప్రయాణికుల, కొనుగోలుదారుల సెల్‌ఫోన్లను దొంగలిస్తున్నారు. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 94 బస్‌స్టాప్, జైన్ మందిర్, కోఠి ఉమెన్స్ కళాశాల తదితర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ దొంగల ముఠా సంచరిస్తూ దృష్టి మళ్లిస్తూ ప్రయాణికుల సెల్‌ఫోన్లు తస్కరిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యల్లో సెల్‌ఫోన్లు మాయమవుతున్నా పోలీసులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

### ప్రతిరోజూ పదుల సంఖ్యలో సెల్‌ఫోన్లు చోరీ..



సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ ఇప్పటి వరకు 40 సెల్‌ఫోన్లు చోరీ కావడం పరిపాటిగా మారింది. ఒకొక్క దొంగ కనీసం ఐదు ఫోన్లు చోరీ చేయందే ఇంటికి వెళ్లలేని పరిస్థితి ఉంది. పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిఒక్క సెక్టార్‌కు ఓ ఏఎస్ఐ ఉన్నా వారు మాత్రం చిన్న చిన్న కేసులపై దృష్టి సారించి దొంగలను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. పోలీసుల నిఘా వైఫల్యం వల్లే చోరీలు అధికమవుతున్న పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే దొంగలు యథేచ్ఛగా చోరీలు చేసి చోరీ చేసిన ఫోన్లను ఇతర రాష్ట్రాలకు సులువుగా తరలిస్తున్నారు.

### కేసులు ఫుల్.. రికవరీ నిల్..

సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించబడ్డ సెల్‌ఫోన్లు రికవరీ కావడం లేదు. దొంగలు ఎంతో నేర్పుగా ఈఎంఐ నెంబర్‌తో పాటు సెల్‌ఫోన్లను మార్పుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ సెల్‌ఫోన్లు పోవడం సర్వ సాధరణమైంది. కేసులు మాత్రం పెరుగుతున్నా రికవరీ మాత్రం కావడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని పోయిన సెల్‌ఫోన్లు తెచ్చి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

## 'కోట' జిగేల్



గోల్కొండ: గోల్కొండ కోట విద్యుత్ కాంతులతో జిగేల్ మంటుంది. కొన్ని నెలల క్రితం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోటలో ఆధునీకరించిన లైట్ అండ్ సౌండ్ షోతో పాటు గోల్కొండ కోటకు విద్యుత్ దీపాలతో అలంకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే కొన్ని రోజుల పాటే కొనసాగిన ఈ లైట్ల ఏర్పాటు ఆగిపోయింది. శుక్రవారం నుంచి అధికారులు మళ్లీ కోటకు పాకాడ్ లైట్లు వేస్తున్నారు. చీకటి పడగానే ఈ లైట్లు వేస్తున్నామని అధికారులు తెలిపారు. రాత్రి 7 గంటల తర్వాత జిగేల్ మంటున్న కోటను చూడడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ చారి

యాకుత్‌పురా: సిటీ సివిల్ కోర్టులో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది వై. శ్రీనివాస్ చారి నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పురానీహవేలీలోని కోర్టులో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన శ్రీనివాస్ చారి న్యాయవాది నవీన్ కుమార్‌పై 218 ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఎం.ప్రవీణ, కార్యదర్శిగా డి.హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శిగా బర్కా రాజేష్‌కుమార్, లైబ్రేరియన్‌గా వి.సుధాంశ్ కుమార్, కోశాధికారిగా విశాల్ సింగ్, క్రీడాలు, సాంస్కృతిక కార్యదర్శిగా సైదిరెడ్డి, లేడీ రిప్రజెంటెటివ్‌గా జస్వంత్ కౌర్, కార్యవర్గ సభ్యులుగా అశోక్, భానుచందర్, మహ్మద్ బర్కత్ అలీ, రాజు, మధుసూదన్, వినోద్‌కుమార్, సవిత మిశ్రా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన దీపక్ సంచెటి తెలిపారు. నుతన కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు సన్మానించి శుభాకంక్షాలు తెలియజేశారు.

### సన్మానం....



యాకుత్‌పురా: సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది బర్కా రాజేష్‌కుమార్‌ను శనివారం పురానీహవేలీలోని కోర్టులో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటమన్నారు.



## ఒకేరోజు రూ.8 కోట్ల ఆస్తిపన్ను వసూలు



అబిడ్స్: ఆస్తి పన్ను బకాయిల చెల్లింపులకు ఇంకా ఒక్క రోజు గడువు మాత్రమే మిగిలి ఉండగా జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ అధికారులు శనివారం రూ.8 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్, ఏఎంసీ, ఎంఎస్ శైలజ సిబ్బంది సహకారంతో ప్రత్యేక చొరవ తీసుకొని సర్కిల్ కార్యాలయం పరిధిలో అత్యధికంగా ఉన్న ప్రభుత్వ శాఖల భవనాల ఆస్తి పన్ను బకాయిలను వసూళు చేసేందుకు ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు చేసి సఫలీకృతులయ్యారు. శనివారం ఆర్టీసీకి చెందిన బకాయిని రూ.78 లక్షల చెక్కును శాఖ డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీస్ తిరుపతమ్మ సర్కిల్ కార్యాలయానికి వచ్చి డీసీ విద్యాధర్, ఏఎంసీ ఎంఎస్ శైలజకు అందజేశారు. ఒకేరోజు రూ.8 కోట్ల ఆస్తి పన్ను కావడంతో ఉన్నతాధికారుల ప్రశంసలందుకున్నారు.

## ఇఫ్తార్ విందు



శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శాలిబండ డివిజన్‌లోని మిశ్రీగంజ్‌లో అల్హే సున్నత్ వల్ జమాత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో అఫ్సర్, మహ్మద్ ఇస్మాయిల్, స్థానిక ప్రాంతాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



ఉస్మాన్ అలీ (ఫైల్)

గోల్కొండ: రోడ్డు ప్రమాదంలో గోల్కొండ నయాఖీలాకు చెందిన బాలుడు మృతి చెందాడు. శుక్రవారం ఉదయం షేక్‌పేట్ ఫ్లైఓవర్‌పై బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఉస్మాన్ అలీ వరుసకు తన సోదరుడైన అఫాన్‌తో కలిసి షేక్‌పేట్ ఫ్లై ఓవర్‌పై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి ఫ్లైఓవర్ రేలింగ్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన ఉస్మాన్ అలీని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతున్న అదేరోజు సాయంత్రం మృతి చెందాడు. ఉస్మాన్ అలీ గోల్కొండలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.